# ఎంతపనాయె

మా ఊరు నడ్మ ఒక మర్రి చెట్టు ఉన్నది. గా చెట్టు మీద కాకులుండేటియి. కాకులే గాకుంట గా చెట్టు మీద తీరుతీర్ల పిట్టలు గూడ ఉండేటియి. దినం పూట కాకులన్ని మేత కోసం యాడికో బోయేటియి. రాత్రి గాంగనే చెట్టు కాడ్కి వొచ్చేటియి. కాకుల పిల్లలు చెట్టు మీద ఉన్న గూట్లె ఉండేటియి. గవ్వి పెద్ద కాకులు ఎప్పుడొస్తయా అని ఎదురుసూసేటియి. పిల్ల కాకులకు మేత బెట్టినంక పెద్ద కాకులు ముచ్చట బెట్టుకుంట గూసునేటియి. ఒక్కోపారి పెద్ద కాకులు పిల్ల కాకులతోని ముచ్చట బెట్టేటియి. దునియ ముచ్చట్ల గురించి జెప్పేటియి.

ఒక రాత్రి పిల్ల కాకికి ఒక పెద్ద కాకి మేత బెట్టింది. మేత బెట్టినంక–

“పండుకో బిడ్డా!” అని అన్నది.

“దినమంత పండుకోనే ఉన్న. గిప్పుడు నాకు నిద్రొస్త లేదు” అని పిల్ల కాకి అన్నది.

“జోలపాట గిన పాడుమంటవా?” అని పెద్ద కాకి అడిగింది.

“నువ్వ గిన పాట బాడితె నా నిద్ర సంగతేమొగాని కద్మ కాకులు గూడ నిద్ర బోకుంట గూసుంటయి” అని పిల్ల కాకి అన్నది.

“మల్ల ఏం జెయ్యుమంటవు?” అని పెద్ద కాకి అడిగింది.

“అమ్మా! ఏదన్న ఒక కత జెప్పవే” అని పిల్ల కాకి అన్నది.

“మంచిది చెప్త ఇను. ఒక ఊర్లె సత్నారి అనే టాయిన ఉన్నడు. గాయినకు మస్తు పొలాలున్నయి. ఊర్లెనే గాకుంట పట్నంల గూడ రెండు మూడంత్రాల బంగ్లలు ఐదారున్నయి. గంతే గాకుంట ఒక సిన్మతేటర్ గూడ ఉన్నది. పొలాలల్ల గాయిన పొగాకు, చెరుకు అసువంటి పంటలను పండించెటోడు. పొలాలు, సిన్మతేటర్ మీద వచ్చేటి ఆమ్దానితోని బంగ్లల మీద వొచ్చేటి కిరాయిలతోని గాయిన సుకంగ బత్కెటోడు. కూలోల్లను బెట్టి గాయిన బామర్ది పొలం పనులు జేపిచ్చెటోడు. సిన్మతేటర్‌ను జీతగాల్లు నడి పిచ్చెటోల్లు. దాంతోని గాయినకు ఏ పని లేకుంట బోయింది. పొద్దుబోక గాయిన రాజకీయాలల్లకు దిగిండు. అట్లిట్ల జేసి ఎమ్మెల్యే అయ్యిండు. జెనం గురించి ఏమన్న జేస్త. నా పానం గూడ ఇస్త అన్కుంట గాయిన స్పీచ్‌లు గొట్ట బట్టిండు. జెనంకు సేవ జేసెతందుకే రాజకీయాలల్లకు వొచ్చిన అని జెప్పబట్టిండు.

ఐదేండ్లు పురాగ గాక ముందె ఎలచ్చన్లు వొచ్చినయి. గీ పారి ఎట్లన్న ఎమ్మెల్లె టికిట్ వొస్తదని సత్నారి అనుకున్నడు. ముందుగాల్ల ఎమ్మెల్లె అయితె అటెంకల మంత్రి గావొచ్చునని అనుకున్నడు. అనుకోని ఊకుండకుంట గాచారం సూసెటోల్లకు చెయ్యిసూబెట్టుకుండు. గాల్లు సత్నారి చెయ్యి జూసి ఎమ్మెల్లె టికిట్ మీకె వొస్తదని జెప్పిండ్రు. టికిట్ ఎట్లన్న వొస్తది గదా అనుకోని ఒక మంచి మూర్తంల సత్నారి ఎన్నికల ప్రచారం షురూ జేసిండు. ఎన్నడు లేంది చిన్గిన పాత బట్టలు గట్టబట్టిండు. గుడిసె వోటల్లకు బోయి చాయ్ దాగబట్టిండు. గుడి కాడ బిచ్చగాల్ల పక్కపంటి గూసోని బువ్వ దినబట్టిండు. మసీదుకు బోయి నమాజ్ సద్వబట్టిండు. ఇంటింటికి బోయి మంచిచెడ్డలు అర్సుకోబట్టిండు. సత్నారి ఇల్లిల్లు దిర్గుతుంటె–


“మాకు నీల్లకు తిప్పలైతున్నది” అని ఒకామె అన్నది.

## తెలిదేవర భానుమూర్తి

“మీరేం ఫికర్ జెయ్యకుండ్రి. గసువంటి గిసువంటి నీల్లు గాకుంట గోదావరి నీల్లు మీ ఊరికె వొచ్చెటట్లు జేస్త” అని సత్నారి అన్నడు.

“గోదావరి నీల్లు మా ఊరికి వొస్తె పుష్కరాలు గూడ మా ఊర్లెనే అయితయా?” అని గామె అడిగింది.

“ఎందుగ్గావు తప్పకుంట అయితయి” అని సత్నారి అన్నడు.



“గోదావరి నీల్లు ఎన్నడొస్తయి?” అని గామె అడిగింది.

“మీరందరు పైసలిస్తె వారం దినాలల్లనే మీ ఊరికి గోదావరి నీల్లు వొస్తయి” అని సత్నారి జెప్పిండు.

“మేము పైసలెందుకియ్యాలె?” అని గామె అడిగింది.

“నేను శాన బీదోన్ని. నా పెండ్లాం పిల్లలు ఒక పూట దింటె ఇంకొపూట ఉపాసముంటున్నరు. బస్సు ఎక్కెతందుకు గ్గూడ నాతాన పైసలు లేకుంట నడ్సుకుంట ఊరూరు దిర్గుతున్న” అని సత్నారి అన్నడు.

## ఎన్నిక(థ)లు

“గట్లనా బిడ్డా! పొద్దుగాల్ల బువ్వ దిన్నవా? లేదా?” అని గామె అడిగింది.

“తినలేదమ్మా!” అని సత్నారి అన్నడు.

“మా ఇంట్ల దినరాదు” అని గామె అన్నది.

“మల్లొచ్చినపుడు తింట తియ్యి” అని సత్నారి అన్నడు. సత్నారి యాడికి బోయినా నేను శాన బీదోన్ని అని జెప్పబట్టిండు.

జెనంను పైసలడ్గ బట్టిండు. జెనం ఇచ్చిన పైసల్తోని ఎలచ్చన్ డిపాజిట్ గడ్త అని జెప్ప బట్టిండు. సామాజికస్పృహ ఇగ టికిట్లు రానోల్లందరు ఒక్క తీర్గ మొత్తుకోబట్టిండ్రు. గాల్లందరు ఒక తాన మీటింగ్ బెట్టిండ్రు.

“మనం ఇండిపెండెంట్లుగ నిలబడి మన పార్టీల లీడర్లకు బుద్ధిజెప్పాలె” అని ఒకడు అన్నడు.

“మనం ఇండిపెండెంట్లుగ నిలబడితె గెలుస్తమా?” అని ఇంకొకడు అడిగిండు.

“మనం గెల్సినా గెల్వకున్నా మనకు టికిట్ ఇయ్యని పార్టీ లీడర్లు ఓడిపోతరు. ఎట్లన్న జేసి మనమందరం ఓట్లను చీల గొట్టాలె” అని ఒకడు అన్నడు.

“టికెట్లు రానోల్లమంత గల్సి ఒక కొత్త పార్టి బెడ్తె బాగుంటది” అని ఇంకొకడు అన్నడు.

“ముందుగాల్ల మనమందరం జులూస్ దీద్దాం” అని ఒకడు అంటె–

“లారీలల్ల జెనంను దోల్క రమ్మని మన చెంచ గాల్లకు జెబ్దాం. మన జులూస్‌కు మస్తు మంది వొస్తె మన బలమేందో అన్ని పార్టిలకు దెలుస్తది” అని ఇంకొకడు అన్నడు.

“మనం పార్టి బెడ్తె పెద్దపెద్ద పార్టిలు గూడ మనతోని పొత్తు గూడెతందుకు ముంగట్కి వొస్తయి. మనమెట్ల జెప్తెగట్ల ఇంటయి”అని ఒకడు అన్నడు.

“గట్లయితె పొరన్ మనం పార్టి బెడ్దాం” అని ఇంకొకడు అన్నడు.

“అమ్మా! ఇంతకు సత్నారికి టికిట్ దొర్కిందా? లేదా? గా ముచ్చట గురించి జెప్పకుంట టికిట్ రానోల్ల గురించి జెప్తవేందే?” అని కాకి పిల్ల అడిగింది.

“టికిట్ రానోల్ల గురించి నేను పుజూల్ల జెప్తలేను” అని పెద్ద కాకి అన్నది.

“పుజూల్ల జెప్పుకుంటనే పుజూల్ల జెప్తలేను అంటవేందే? కాకులు గిన ఎలచ్చన్ల బెడ్తె నువ్వే లీడరువైతవే” అని కాకి పిల్ల అన్నది.

“కాకి పిల్లకేమెర్క అని అందరు ఎందుకంటున్నరో గియ్యాల్ల నిన్ను జూస్తె ఎర్క అయ్యింది” అని పెద్ద కాకి అన్నది.

“ముందు గాల్ల కత జెప్పే” అని కాకి పిల్ల అన్నది.

“టికిట్ రానోల్ల పార్టికి సత్నారే ప్రెసిడెంటు అయ్యిండు” అని పెద్ద కాకి జెప్పింది.

“సత్నారికి గ్గూడ టికిట్ రాలేదా? ఎందుకు రాలేదు?” అని పిల్ల కాకి అడిగింది.

“సత్నారి నేను బీదోన్ని. మా ఇంట్ల ఒక్క పూట తింటె ఇంకొపూట అందరు ఉపాస ముంటున్నరు అని అందరితోని జెప్పుంటె నిజమేనేమోనని గాల్ల పార్టి లీడర్లు అనుకున్నరు. పైసల్లేనోడికి టికిట్ ఇస్తె ఎలచ్చన్ల ఎట్ల గెలుస్తడనుకోని సత్నారికి టికిట్ ఇయ్యలేదు. నాకు నిద్రొస్తున్నది. నువ్వు గూడ బండుకో” అని పెద్ద కాకి అన్నది.